# ఆదివారం

— ఉపద్రష్ట సాయి

ఎప్పుడూ జన సందోహంతో రద్దీగా కనిపించే మహానగరం రహదారులు ఆదివారం సాయంత్రం మాత్రం నిర్జీవంగా, నిర్మానుష్యంగా కనిపిస్తాయి. అది మానగరంలో విషయం. ఎవరో ఒకరో ఇద్దరో అటూఇటూ తిరుగుతుంటారు. ఐదు నిమిషాలకో పదినిమిషాలకో ఒక కారో బస్సో కనిపిస్తుంది. కానీ మిగతా ఆరు రోజులూ మాత్రం వీధిలో నడవడం కూడా కష్టమే. పేవ్‌మెంట్ల మీద కూడా పిసరంత ఖాళీ వుండదు. అలాటిది, ఆదివారం రాగానే జనమంతా ఎవరి గూళ్లలో వాళ్ళు విశ్రాంతి తీసుకుంటారు. ఆరు రోజులు అలసట ఒక రోజు విశ్రాంతితో తీరి పోతుంది. మళ్లీ మర్నాడు పరుగు మొదలు పెడతారు. ఇది నగర జీవితం.

ఆదివారం సాయంత్రం మాత్రం ఎందుకో నాకు ఇంట్లో వుండాలనిపించదు. ఇంట్లో అందరూ టి.వి.లోని సినిమా కోసం ఉత్సాహంగా కూర్చుంటే, నేను మాత్రం ఆ పెట్టెను తప్పించుకుని బయట పడతాను. కారణం సినిమాల మీద ద్వేషం కాదు. కానీ చిన్నప్పటినుంచి నేను సినిమాల మీద పెద్దగా ఇంటరెస్ట్ చూపించేవాడినికాను. మావాళ్ళు మాత్రం సినిమా మొదలయ్యే సరికి విగ్రహాల్లా కదలకుండా కూర్చుండిపోతారు. నాతో మాట్లాడే ఓపిక వాళ్లకుండదు. పోనీ ఇంటికెవరైనా వస్తారా అంటే అది కూడా అరుదే. ఆదివారల్లో ఒకళ్ళింటికి ఒకళ్ళు తప్పనిసరైతేనే వెళ్తారేమో. అది కూడా సాయంత్రంలోగానే. తర్వాత ఇంటికి వచ్చిన వాళ్ళకు సపరిచర్యలు కృత్రిమంగా చెయ్యడం జరుగుతుందే కానీ అందులో అభిమానం పాలు తక్కువగానే వుంటుందని నా అభిప్రాయం. సాధారణంగా నా వ్యకిగతమైన పనులను ఆదివారం సాయంత్రం చేసుకుందామనుకునే వాడిని. మొదట్లో కొంత కాలం అలా చేసుకోగలిగినా కాలక్రమేణ ఆదివారాలు కూడా పనికిరాకుండాపోయాయి. అందరూ నాలాగే వుండరుగా. అందుకే నేనెవరి దగ్గరికి వెళ్ళాలనుకుంటానో ఆ వ్యక్తి నాకేదో పనుంది అని దాటేసేవాడు. పోతే చాలా షాపులు కూడా ఆదివారాలు సెలవును పాటిస్తాయి. ఈ విధంగా ఆదివారం సాయంత్రం నన్నిబ్బంది పెట్టేది. చివరకు నాకొక కొత్త ఆలోచన వచ్చింది. సముద్ర తీరానికి వెళ్లి అక్కడ హాయిగా కూర్చుని ఏకాంతంగా సముద్రాన్ని చూస్తూ గడపవచ్చు. ఎవరైనా స్నేహితుడు దొరికితే ఇంకా మంచిది. కాసిని బఠానీలు కొనుక్కుని ఎంచక్కా కబుర్లు చెప్పుకుంటూ గడపవచ్చు ఆలాగే ఏ గుడికైనా వెళ్లి ప్రశాంతంగా దైవ దర్శనం చేసుకోవచ్చు. కనుక ఆదివారాలు గుడికో, సముద్ర తీరానికో కేటాయించేవాడిని. ఆ విధంగా మెల్లగా మూడు నెలలు గడిచాయి.


ఈ మూడు నెలల్లో నాకు చాలా విషయాలు తెలిసాయి.

నగరంలో నాలాగే ఎందరో వున్నారు. సాధారణమైన వ్యాపకాలు వాళ్ళకు కూడా నచ్చవు. టి.వి., సినిమా వాళ్ళకు మానసిక ఆనందాన్ని కలిగించలేక పోయాయి. ఆ వెలితి ఏమిటి? సగటు మనిషి తన జీవితంలోని వెలితిని వినోద కార్యక్రమం ద్వారా తీర్చుకోగలిగితే నాలాంటివాళ్ళెందుకు అలా చెయ్యలేక పోతున్నారు.

ఈ ప్రశ్నకు అర్థం దొరకలేదు.

కానీ నాలాంటి వాళ్ళు మరి కొందరున్నారని మాత్రం నాకు తెలిసింది

సుదీర్ఘంగా ఈ విషయం గురించి ఆలోచిస్తూ ఆదివారం సాయంత్రాలు గడిపేవాడిని. నా ప్రయాణాల్లో ఎందరినో కలుసుకునే వాడిని. ఒక్కొక్కప్పుడు ఏకాంతంగా గంటలు తరబడి సముద్ర తీరంలో గడిపేవాడిని. విశాలమైన ఆకాశం, విశ్రాంతి లేకుండా తీరం కేసి పరుగులు తీసే కెరటాలు, తరతరాలుగా వున్న చోటే ఉలకక పలకక పడుండే ఇసుక రేణువులు, చల్లగా వీచే గాలి కెరటాలు నా అభిమాన స్నేహితులు.




ఈ అనంత విశ్వంలో ఎందరో బ్రతుకుతున్నారు. కోట్లాది జనాభా. క్రిమి కీటకాల్లా, జంతువుల్లా గొంగళిపురుగుల్లా జనం. క్షణం క్షణం పుట్టుకు వస్తూనే వున్నారు. పోయేవాళ్ళు పోతూ, వచ్చే వాళ్ళు వస్తూ ఈ ప్రపంచంలో ఎప్పుడూ చలనాన్ని కలిగిస్తూనే వున్నారు. అసలీ అనంత విశ్వానికి అర్థమేమిటి? బ్రతుకుకు నిర్వచనం ఏమిటి? మనిషి పుట్టుకకు కారణం కేవలం ఇద్దరి శరీరవాంఛే కదా? అలా వాంఛనుంచి జన్మించిన మనిషి బాధ్యత ఏమిటి? ఇటువంటి ప్రశ్నలు ఉదయించడం అస్తమించడం జరిగేవి.

మనిషి తనకంటూ తను బ్రతుకుతున్నాడు.

లేదా తనవాళ్ళ కోసం బ్రతుకుతున్నాడు.

పై రెండు రకాల మనుషులలో కొంత స్వార్థం వుంటుంది. దానికి తగినట్లే వారి ప్రవర్తన వుంటుంది. అలా బ్రతికే మనుషులు పంజరాల్లోని పక్షుల్లా వుంటారు. వారి వల్ల సమాజానికి లాభం వుండదు.

మరైతే అందరూ సంఘ సంస్కర్తలు కావాలా? ఈ ప్రశ్న ఉదయించినప్పుడు కొంత కాలం ఆలోచించాను.

ఒక్క మనిషి ఆలోచన ఈ సమాజాన్ని మార్చడం కష్టం అని తెలుసుకున్నాను. కాకపోతే నాలాంటి వాళ్ళు చెయ్యగలిగిందల్లా ఒక్కటే. ఒక మనిషి సైన్యంలా మారాలి. వీలైనంత మంచిని పరులకు బోధించాలి. కల్మషాన్ని కొంచెం కొంచెంగా కడగాలి. అంతే.

మనసు శుభ్రమైతే మనిషి శుభ్రమవుతాడు.

ఆలోచనలు ఆరోగ్యకరమైనవైతే బ్రతుకు ఆరోగ్యకరంగా వుంటుంది. కనుక తాత్వికచింతనను అలవరచుకున్న నేను ఒక ఆదివారం సాయంత్రం అలవాటు ప్రకారం సముద్రతీరానికి వెళ్లడానికి బదులు, వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్ళాను.

ఆలయ ప్రాంగణం ప్రశాంతంగా వుంది.

స్వామికి నిలువెత్తు అలంకారం చేశారు.

కానీ జనం లేరు.

చలవరాతి ప్రాకారంలో నేను మాత్రం స్వామికెదురుగా కూర్చుని కళ్ళు మూసుకుని ధ్యానం చేస్తున్నాను. అలా ఎంత సేపు గడిపానో తెలియదు.

నా ప్రక్కనే కొంత అలికిడి అవడంతో కళ్ళు తెరిచి చూశాను. అంతవరకు అక్కడ ఎవ్వరూ లేరనుకున్న నాకు నా ప్రక్కనే కూర్చున్న ఒకతను వెక్కి వెక్కి ఏడవడం కనిపించింది. మనిషి మధ్యతరగతి కుటుంబానికి చెందిన వాడు. నలభై సంవత్సరాల వయసుంటుంది అతనికి. పేదవాడు కాడు. చేతికి ఉంగరం, వాచీ, మెడలో సన్నని గొలుసు వున్నాయి. కానీ అతని మొహం పాలిపోయి వుంది. మనిషి కళ్ళు నిర్జీవంగా వున్నాయి. అతని మనసు నిండా ఏదో ఆవేదన వుందని ఎవరికైనా అర్థమవుతుంది. సాధారణంగా ఆలయ గర్భగుడి దగ్గర కూర్చుని ధ్యానంలో లీనమైన ఎవరికైనా ఏదో సమస్య వుంటుందని అనుకునే వాడిని నేను: కారణం ఒకటే. చాలా మంది సగటు జీవులు సమస్యల ఊబిలో పడి మానసిక ఆందోళనతో సతమతమయ్యే సమయంలోనే భగవంతుడిగురించి ఆలోచిస్తాం. దుర్భర మానసిక వత్తిడులను తట్టుకోలేనప్పుడు, తమ ఆవేదనను వివేదించుకోడానికి ఎవరూలేనప్పుడు దైవ సన్నిధిలో తమ బాధను మొర పెట్టుకోవడ మొక్కటే గత్యంతరమనిపించి అక్కడికి వస్తారు. అంటే వారి ఆవేదనకు పరిష్కారం వెతుక్కోవటంలో అది ఆఖరి ప్రయత్నం. అంత వరకు వాళ్ళు చేసిన ప్రయత్నాలన్నీ ఫలించకపోవడం వల్ల మరో మార్గం లేక వాళ్ళు వెతుక్కునే మార్గం దేవుడి సన్నిధిని చేరడమే.

అంటే నాప్రక్కన కూర్చున్నవ్యక్తి ఏదో భరించలేని కష్టాన్ని అనుభవిస్తున్నాడనిపించింది నాకు. అతను మౌనంగా తన బాధను భగవంతుడి ముందు నివేదిస్తున్నాడు. అతను అలా కొంతసేపు ధ్యానం చేసి మెల్లగా లేచి నడుస్తూ ఎదుటికి వచ్చాడు.

నేను కూడా అతనితో బాటే నడిచాను. అతను ఆలయం చుట్టూ ఒక ప్రదక్షిణ చేసి అక్కడే ఒక చెట్టు దగ్గర సిమెంటు బల్ల మీద కూర్చున్నాడు. ఎందుకో నా మనసు అతన్ని పలకరించాలని తాపత్రయపడింది. అతని మనసులోని ఆవేదన ఏమిటో తెలుసుకోవాలనిపించింది. కానీ ఆ పలకరింపే అతని మనసును మరింత కలవర పెడితే... కొన్ని సమయమాలలో ఓదార్పు ఉపశమనానికి, బదులు బాధను రెట్టింపు చేస్తుంది. అలా బల్ల మీద కూర్చున్న అతనికి కొంత దూరంలో నేను కూడా కూర్చున్నాను. అతను ప్రశాంతంగా కూర్చుని నన్ను చూసి కళ్ళతోనే పలకరించాడు. ఎందుకో నాకు అతనితో మాట్లాడాలనిపించింది.

"మీరు ఆదివారాల్లో గుడికి రెగ్యులర్‌గా వస్తుంటారా?" పలకరింపు మొదలైంది.

"రెగ్యులర్ అని చెప్పలేను. కానీ అప్పుడప్పుడు మనశ్శాంతి కోసం వస్తుంటాను. మీకో ఆశ్చర్యకరమైన విషయం చెప్తాను. చలనం వున్నమనుషుల కన్నా చలనం లేని ఆ దేవుడి విగ్రహం మనకెంతో మనశ్శాంతిని కలిగిస్తుంది. మన గోడును ఆయన వింటాడో లేదో మనకు తెలియదు గానీ, విన్నాడనే మనమనుకుంటాము. కానీ ఆ గోడు మనుషులకు చెప్తే వాళ్ళు విన్నా మనకు సందేహమే విన్నారో లేదో అని. మన కష్టాలను ఆ రాతి విగ్రహానికి నివేదించుకున్న తరువాత ఆయన మన గుండెలోని బాధను తప్పకుండా తీరుస్తాడనుకుంటాము. కానీ మనుషులతో మన కష్టాలను చెప్పుకుంటే..వాళ్ళు ఆ కష్టాలను తీర్చగలరా అని సవాలక్ష సందేహాలతో వుంటాము. అదే ఆ శక్తి. అందుకే ఆదివారాలలో అప్పుడప్పుడు ఈ గుడికి వస్తూ వుంటాను" అన్నాడతను.

"అసలింతకీ మీకు మానసికంగా అశాంతిని కలిగించే విషయమేమిటో చెప్తారా... ఠపీమని అప్రయత్నంగా అడిగాను. నా ప్రశ్నను అతను ఎదురుచూడలేదు.రెండునిమిషాల తర్వాత తెప్పరిల్లి "అది చెప్తే తీరేది కాదు సార్" అన్నాడు. ఈమాటు ఆశ్చర్యపోవడం నా వంతైంది. అయినా తమాయించుకుని "మీ సమస్య ఏదో నాకు తెలియదు. నాతో చెప్తే అది తీరే సమస్యా లేక తీరని సమస్యా అని నిర్ణయించుకుని పరిష్కారం గురించి ఆలోచించవచ్చు. రాతి విగ్రహం ముందు మీ సమస్యలు చెప్పుకున్నా మీరు నాతో కూడా చెప్పండి... తర్వాత అది నిజంగా సమస్యేనా అని తేల్చుకుందాం" అన్నాను.

మరో ఐదు నిమిషాల తర్వాత, "మీరు ఎవరో నాకు తెలియదు. అయినా ఎందుకో తొలి పరిచయంలోనే ఆత్మీయత కనబరుస్తున్నారు కనక నా మానసిక ఆవేదన చెప్తాను. కానీ ఇదేదో పరిష్కారం కోసం అని అనుకోవద్దు. కొన్ని సమస్యలు మరొక రితో చెప్తే మనసుకు కొంత ఊరట కలుగుతుంది. ఆ ఊరట కోసమే ఈ గుడికి వస్తుంటాను" అన్నాడు అతను.

అతని మొహం పాలిపోయింది.

మళ్ళీ అతనే చెప్పాడు.

"నాకు పెళ్ళై పదిహేను సంవత్సరాలైంది. పదకొండు సంవత్సరాల కొడుకు వున్నాడు. నాలుగు సంవత్సరాల తర్వాత పుట్టిన ఏకైక పుత్రుడు. వాడి మీద మేమెన్నో ఆశలు పెంచుకున్నాము. కానీ పుట్టిన రెండు సంవత్సరాల తర్వాత మాకు తెలిసిన నిజం.... వాడు మానసిక వికలాంగుడు. ఇప్పుడు పదకొండు సంవత్సరాల మా అబ్బాయికి నిలబడడం, నడవడం, మాట్లాడడం, మనుషులను గర్తుపట్టడం, ఆహారం తినడం, వంటివి రాలేదు. వాడొక అందమైన కదిలే బొమ్మ. అంతే ఉదయం లేచిన దగ్గర్నుంచీ రాత్రి పడుక్కునే దాకా వాడి పరిచర్యలుమనం చెయ్యవలసిందే. ఏడాదికేడాది వాడు శారీరకంగా పెరుగుతున్నాడు. మొదట్లో మేమెంతో ఉత్సాహంతో వాడి పనులు చేసేవాళ్ళం. కానీ కాలక్రమేణ మాకు వయసు మీద పడడం మూలాన, వాడు పెరగడం మూలాన మా ఉత్సాహం సన్నగిలింది. ఈ దశలో వాడి భవిష్యత్తు మీద మాకు భయం వెయ్యడం మొదలైంది. మేము లేకపోతే బ్రతకలేనివాడు మా తర్వాత ఏమవుతాడో అనే భయం మమ్మల్ని కృంగదీస్తోంది. ఇప్పటికే జీవితంలో బాగా అలసి పోయాము. ఇంకా ఎంత కాలం..." అంటూ అతను వెక్కి వెక్కి ఏడవటం మొదలుబెట్టాడు.

అతని భుజాలు కుదుపుతూ, అతని చేతులు పట్టుకుని ఓదార్పుగా చెప్పాను... కాదు,అడిగాను.

"మీరు లాటరీ టిక్కెట్లు కొంటారా?"

"అప్పుడప్పుడూ ఒక్కటీ రెండు" వెక్కుతూ చెప్పాడు అతను.

"మీది సొంత ఇల్లా...." అడిగాను

"అవును... మా తాతగారు వదిలిపెట్టిన ఇల్లే..."

"అందులో చెట్లూ చేమలూ..." మళ్ళీ అడిగాను.

"వేపచెట్టు.... కొబ్బరి చెట్టు... నిమ్మ నారింజ వున్నాయి. ఈ మధ్య అయిదేళ్ళ క్రితం... ఒక మామిడి చెట్టు పెట్టాను..." అన్నాడు నాకేసి చూస్తూ... ఆ చూపులో ఈ చచ్చు ప్రశ్నలెందుకూ అనే అర్థం గోచరించింది.

"మీరు ఉద్యోగం చేస్తున్నారా' అడిగాను మళ్ళీ.

"లేదు... చిన్న వెచ్చాల కొట్టు పెట్టుకున్నాను" అన్నాడు.

తర్వాత తనే అడిగాడు-మీ ప్రశ్నలకూ నా జీవితానికి ఏమిటి సంబంధం అని.

"ఉంది సార్...మీరు లాటరీ టిక్కెట్లు కొన్నా, మామిడి మొక్క పెట్టినా, వెచ్చాల వ్యాపారం చేసినా మీ చేతల వెనుక అదృశ్యమైన ఒక అనుభూతి దాగుంది. అది ఏమిటో గుర్తించారా?" అడిగాన్నేను.

అతను రెండు నిమిషాలు ఆలోచించి 'లేదు' అన్నాడు.

అతని నోటమ్మటే సమాధానం తెప్పించాలని మళ్ళీ ఇందాక అడిగిన ప్రశ్నే అడిగాను. కానీ అతను నేను ఊహించిన సమాధానానికి బదులు, తన చర్యల వల్ల ఎదురుచూసే లాభం గురించి మాత్రమే చెప్పాడు.

నేను మాట్లాడక తప్పలేదు.

"లాభం సంగతి సరేనండి... కానీ ఆ లాభం మీకు వస్తుందనడానికి కారణం" అడిగాను నేను...

"నమ్మకమే కదా" అన్నాడు.

"అమ్మయ్య సరిగ్గా చెప్పాడు" అనుకుని

"అవును... నమ్మకమే. రూపాయి ఇచ్చికొన్న లాటరీ టికెట్‌కు లక్ష రూపాయలు పడుతుందని నమ్మే మీరు, మామిడి చెట్లు ఎప్పుడో తప్పక కాస్తాయని నమ్మే మీరు,వెచ్చాల కొట్టులో బాగా సంపాదించాలని నమ్మే మీరు, మీ అబ్బాయి మరి కొన్ని సంవత్సరాల తర్వాత ఎంతో కొంత బాగు పడతాడని ఎందుకు నమ్మకూడదు సార్... మీరు పెట్టిన మామిడి చెట్లు తియ్యని కాయ లే ఇస్తాయని ఎలా నమ్ముతున్నారు! అవి పుల్లగా వుండవచ్చు లేదా కాయలు కూడా ఇవ్వక పోవచ్చు. అయినా మీరు శ్రద్ధగా వాటికి నీళ్లు పోయడం ఎరువులు వెయ్యడం చేస్తుంటారు... కదా" అడిగాను

"అవును"

"అంటే... మీ శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుందనే నమ్మకం మీకుంది. అలాగే లాటరీ టిక్కట్టు కూడా... మీ అబ్బాయి విషయం కూడా అలాగే అనుకుని నమ్మకంతో బ్రతకండి సార్. మీ కృషి మీరు చెయ్యండి. ఇస్తున్న తర్ఫీదులు జాగ్రత్తగా చేయించండి. అందరికీ అతీతమైన ఆ రాతి విగ్రహం మీద మీకు నమ్మకం వుంటే మీ నమ్మకమే సమస్యలకు పరిష్కారమవుతుంది" అన్నాను.

అతను రెండు నిమిషాలు మళ్ళీ నిశ్శబ్దంగా కూర్చుని...

"అవునుసార్... మీరు చెప్పింది నిజం. నమ్మకం అనే అజ్ఞాత శక్తి గురించి మనిషి ఆలోచించడు. కానీ ఆ శక్తి ఆది శక్తివంటిది. అని మీరు ఎంతో చక్కగా చెప్పారు. సాధారణంగా మనిషి అతి చిన్న జీవన సత్యాన్ని కూడా మరో మనిషి చెబితే గానీ తెలుసుకోలేడు. అలా చెప్పే వాళ్లు సగటు మనిషిని మించిన మహానుభావులు."

"ఆదివారాల్లో ఇంట్లో వుంటే మనశ్శాంతి వుండదని బయటపడే నాకు... మీ వంటి వ్యక్తి కనువిప్పు కలిగించడం నా అదృష్టం..." అన్నాడతను.

నామాట ఎవరూ వినని నాఇంట్లో కన్నా నామాట ఒకవ్యక్తి జీవితంలో మార్పును తెలుస్తుందని తెలుసు కున్న తృప్తితో అతని దగ్గర సెలవు తీసుకుని బయలు దేరాను... అప్పటికే ఆ ఆదివారం....రాత్రి వడిలోకి జారిపోతోంది. □